క్లుప్తంగా

ఘనంగా భంభం బాబా ఆరాధన



కనుకూరులో భంభం బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

శెట్టూరు: మండలంలోని కనుకూరు భంభం బాబా అన్వరానంద స్వామి దేవాలయంలో ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా సంపూర్ణ రాత్రి భంభం బాబా కీర్తనలతో ఆరాధన చేపట్టారు. శనివారం ఉదయం దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భం భం అన్వరానంద బాబా చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు నిజలింగ, రామప్ప, నారాయణప్ప, సోమనాథప్ప, రామాంజనేయులు, వన్నూరుస్వామి, దురుగప్ప, వేమన్న, అంజిమూర్తి, జయన్న గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరోపణలన్నీ అవాస్తవాలే..

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అవినీతి, ఆరోపణలు జరిగాయంటూ అవాస్తవాలు రాసిన ఓ దినపత్రిక విలేకరిపై చర్యలు తీసుకోవాలని ప్రధాన అర్చకుడు ద్వారకానాథస్వామి, ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయం అర్చకుడు బాలాజీస్వామి, ఈఓ కె. విజయ్‌కుమార్ కోరారు. శనివారం ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లంచం ఇవ్వలేదనే కారణంతో ఆలయంలో అభివృద్ధి, పూజలు సక్రమంగా జరగడం లేదని తప్పుడు కథనాలు ప్రచురించడం చాలా బాధాకరమన్నారు. ఆ పత్రిక వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని కోరారు.

కాళ్ల గట్టమ్మ, కొల్లాపురమ్మ జాతర



శెట్టూరు నుంచి అయ్యగార్లపల్లి గ్రామానికి వెళ్తున్న కాళ్ల గట్టమ్మ దేవత ఊరేగింపు

శెట్టూరు: మండల కేంద్రంలో కాళ్ల గట్టమ్మ, అయ్యగార్లపల్లిలో కొల్లాపురమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం కాళ్ల గట్టమ్మ జాతరలో భాగంగా ఎంపీపీ లక్ష్మిదేవి, సర్పంచ్ కుమార్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అమ్మవారిని వడి బియ్యం కార్యక్రమానికి పల్లకీలో శెట్టూరు నుంచి అయ్యగార్లపల్లికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అయ్యగార్లపల్లి ప్రజలు కాళ్ల గట్టమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. అలాగే అయ్యగార్లపల్లి గ్రామ దేవత కొల్లాపురమ్మకు జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, సర్పంచ్ భారతి, గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల జాతరలు ఈ నెల 18 వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రెండు గ్రామాల పెద్దలు ప్రజా ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని హులికల్లు గ్రామంలో శనివారం ఓ వివాహిత విషపూరిత ఆకు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దంపతుల మధ్య గొడవలే ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న వివాహితను గుర్తించిన కుటుంబీకులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు ప్రాథమిక వైద్యం చేసిన అనంతరం అనంతపురం తరలించాలని సూచించారు. ఔట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు.

అంజన్నకు అభిషేకం



ప్రత్యేక అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటింటా సంక్రాంతి సంబరాలు



కళ్యాణదుర్గం: మంత్రి ఉషశ్రీచరణ్ ఇంటి వద్ద భోగి మంటలు

- గ్రామాల్లో పండుగ కోలాహలం
- ఆకట్టుకున్న రంగవల్లులు

కళ్యాణదుర్గం/రాయదుర్గం/ఉరవకొండ సాక్షి బృందం: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. శనివారం ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ భోగి మంటల్లో వివిధ వస్తువులు వేసి అగ్నిదేవుడి సాక్షిగా చెడు కర్మలను తొలగించి పుణ్యగతులను సిద్ధంపజేయాలని వేడుకున్నారు. అలాగే మహిళలు తెల్లవారుజామునే లేచి ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు. అందులో గొబ్బెమ్మలు పెట్టి , పసుపు, కుంకుమ పూసి, వాటికి తంగేడు, గుమ్మడి, చామంతి పూలు పెట్టి పూజలు చేశారు. చిన్నారులు మైదానాల్లో గాలిపటాలు ఎగురవేశారు. నువ్వులు, వేరుశనగ విత్తనాలు, బెల్లంతో తయారు చేసిన పిండి వంటలు, సజ్జ రొట్టెలు కుటుంబసభ్యులతో కలసి ఆరగించారు. సాయంత్రం ఇళ్లల్లో చిన్నారులు భోగి పండుగ పేరింటం చేశారు. కాగా కళ్యాణదుర్గంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. శనివారం వేకువజామునే కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఆవరణలో భోగి మంటలు వేశారు. అలాగే కుందుర్పి మండలం ఎన్.వెంకటంపల్లిలో మహిళలతో కలిసి మంత్రి సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు నింపేలా జగనన్న పాలన ఉంటుందని, రాబోవు రోజుల్లో జగనన్నను ఆశీర్వదించాలని మంత్రి ఆకాంక్షించారు.



బొమ్మనహాళ్: భోగి మంటలు వేసిన దృశ్యం



ఉరవకొండ: రంగురంగుల ముగ్గులు వేసిన మహిళలు

సంక్రాంతి శుభాకాంక్షలు





విప్ కాపు రామచంద్రారెడ్డి | మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరరెడ్డి | ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

రాయదుర్గం/ఉరవకొండ: అచ్చమైన తెలుగు సంప్రదాయలు ఉట్టిపడే సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త కాంతులు నిండి అందరికి మంచి జరగాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. పట్టణాల్లో స్థిరపడిన ప్రతి ఒక్కరూ గ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి పండుగ జరుపుకుంటారన్నారు. అంతటి విశిష్టత కల్గిన పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో సుఖ సంతోషాలు తీసుకురావాలన్నారు. రైతులకు సకాలంలో పంటలు చేతికందాలన్నారు.

గ్రామాల్లో సంక్షేమ పండుగ



వెంకటంపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంత్రి ఉషశ్రీచరణ్

కుందుర్పి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పల్లెల్లో ప్రతి ఇంటా సంక్రాంతి ఉత్సవాలు వెల్లివిరుస్తున్నాయని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం ఉదయం మంత్రి స్థానిక నాయకులు, అధికారులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకే గ్రామానికి వచ్చిన మంత్రికి పెద్ద సంఖ్యలో మహిళలు హారతులతో స్వాగతం పలికారు. మొదట మంత్రి భోగి పండుగను పురస్కరించుకుని రెండు ఇళ్ల వద్ద ముగ్గులు వేసి రంగులు దిద్దారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాశ్రేయస్సే పరమావధిగా పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ నేత చంద్రబాబుకు సంక్షేమాన్ని చూసి మతిభ్రమించి కర్నూలు సభలో 'సైకిల్ పోవాలి..సైకిల్ పోవాలి' అన్నారని ఎద్దేవా చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు జగనన్న పెద్దపీట వేశారన్నారు. వెంకటంపల్లిలో శ్మశాన స్థలం కావాలని ఎస్సీ కాలనీ ప్రజలు మంత్రికి విన్నవించగా త్వరలోలే స్మశాన స్థలం చూపిస్తామని హామీ ఇచ్చారు.రూ.5 లక్షలతో ఎస్టీ కాలనీలో సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు.అంతకు ముందు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మంత్రిచేత కాలనీ యువకులు భూమిపూజ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు అంజినరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ముజీవుల్లా, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, నాయకులు కృష్ణారెడ్డి, సోమశేఖర్, భీమప్ప, హనుమంతరాయుడు, రామాంజనేయులు, నిజవల్లి బాబు, మల్లయ్య, గోపాల్, భరత్, మర్చంట్ గోపాల్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!



ప్రధాన రహదారిపై గుంత

కూడేరు: స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపాన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఉన్న గుంతతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. గత ప్రభుత్వంలో రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో మురుగు రహదారిపైకి చేరి ట్రాన్స్‌కో కార్యాలయం నుంచి స్టేట్ బ్యాంక్ వరకు ఇళ్ల ముందర కంపుకొట్టేది. దీంతో ఏడు నెలల క్రితం ఎంపీపీ నారాయణరెడ్డి మండల పరిషత్ నిధులతో రహదారిని తవ్వి సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి మురుగు నీటికి పక్కకు మళ్లించారు. కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు తారు, కంకరతో తవ్విన ప్రాంతంలో మరమ్మతు చేయలేదు. ఫలితంగా మట్టి నగ్గి గుంత ఏర్పడింది. వాహనదారులు రాత్రి వేళ వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ముగిసిన ఆర్‌వైఎస్‌ఎల్ టోర్నీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి. చిత్రంలో ఎస్పీ ఫక్కీరప్ప, కాపు భారతి, కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గం: మూడు వారాలపాటు సాగిన రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్ (ఆర్‌వైఎస్‌ఎల్) మెగా క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని రాయదుర్గంలో యువనాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. క్రీడలను తిలకించేందుకు వేల మంది తరలిరావడం రాయదుర్గం చరిత్రలో రికార్డుగా నిలిచింది.



ఫ్లడ్ లైట్ల వెలుతురులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



క్రీడాభిమానుల సందడి

మల్లిపల్లిలో జాతర సందడి



ఎద్దులబండిపై జాతరకు వెళ్తున్న మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లిలో చౌడేశ్వరి జాతరను శనివారం ఈఓ దేవదాస్, తోగటవీర క్షత్రీయులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతరకు మంత్రి ఉషశ్రీచరణ్ ఎద్దుల బండ్లపై ఊరేగింపుగా వచ్చారు. మంత్రికి అధికార బృందం, కళానాట్యమండలి సభ్యులు స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి దంపతులకు వేదపండితులు ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్నదానం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ సుధాకర్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు

గుమ్మఘట్ట: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎవరైనా కోడిపందేలు, పేకాట తదితర జూదాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సునీతహెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. కోడి పందేలను ఎవరైనా ప్రోత్సహించినా, నిర్వహించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని, ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలించినా, విక్రయించినా, సరాఫరా చేసినా కఠిన చర్యలు చేపడతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి సమాచారాన్ని పోలీసులకు తెలియచేసి సహకరించాలని ఆమె కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు : చింతలచెరువులో ఓ మహిళ విష ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బేగంబీ అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి కుటుంబ సభ్యులు తోడవడంతో మనస్థాపానికి గురైన ఆమె శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అనంతపురం తరలించినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణోత్సవం



తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి వేంకటరమణస్వామి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ధనుర్మాసం ముగింపును పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ గావించారు. అనంతరం గోదాదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణోత్సవానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కాపు భారతి హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గోదాదేవి అలంకరణలో చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, శ్రీలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు ఉమాపతి, కోడూరు లక్ష్మి, అర్చకులు సునీల్‌శర్మ, నరసింహస్వామి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



అడిగుప్ప ఆంజనేయస్వామి మాన్యం భూమి నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప ఆంజనేయస్వామి దేవాలయ మాన్యం భూమిలో ఉన్న ఎర్రమట్టిని ఇటుకబట్టీలకు అక్రమంగా తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రుచిమరిగిన టీడీపీ నాయకులు మట్టి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఆంజినేయస్వామి మాన్యానికి చెందిన సర్వేనెంబర్76 ఏలో 103.28 భూమి ఉంది. ఇందులో చింత, కానుగ, వేప, సీమకానుగ, రాగి మొక్కలను బ్లాక్‌ప్లాంటేషన్ కింద నాటి సంరక్షిస్తున్నారు. అంతేకాకుండా ఉపాధి నిధులతో ఫారంపాండ్ పనులను విరివిగా చేయడంలో మట్టిని తరలించేందుకు సులువుగా మారింది. పోలీసులు, దేవదాయశాఖ, రెవెన్యూ, మైన్స్ జియాలజి శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది జిల్లా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

పెన్నహోబిలంలో పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈఓ కె. విజయ్‌కుమార్, అర్చకుల ఆధ్వర్యంలో శనివారం పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి, మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే నూతన రథం నిర్మాణానికి ఆస్ట్రేలియాకు చెందిన నరేష్‌చౌదరి రూ.1,00,116, విడపనకల్లు చెందిన ముమ్మడి వారి జ్ఞాపకార్థం రూ.11,116, దావనగేరి సహన రూ.11,000, ధర్మవరానికి చెందిన నిఖిల్‌కుమార్ రూ. 10,000, వజ్రకరూరుకు చెందిన ఓబుళేసు రూ. 5,116, గుంతకల్లుకు చెందిన షరీఫ్ సయ్యద్ రూ.5,000 విరాళం ఈఓ కె. విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఇప్పటివరకూ నూతన రథం నిర్మాణానికి విరాళాల రూపంలో వచ్చిన మొత్తం రూ.77,93,540 ఆలయ ఖాతాకు జమచేసినట్లు ఈఓ తెలిపారు.

ఆటో ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో నాని అనే బాలుడిని శనివారం ఆటో ఢీకొనడం తో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. నాని రోడ్డు దాటుతుండగా చింతలచెరువు నుంచి వేగంగా వస్తున్న ఆటో ఢీ కొనింది. తీవ్రంగా గాయపడిన నానిని కుటుంబ సభ్యులు పామిడికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశాజనకంగా వేరుశనగ



బోర్ల కింద సాగైన వేరుశనగ

కూడేరు: మండల వ్యాప్తంగా గత ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో భూగర్భ జలాలు పెంపొందాయి. ఫలితంగా బోర్లలో నీటి లభ్యత పెరిగింది. దీంతో రబీలో బోర్ల కింద వేరుశనగ సాగు పెరిగింది. సుమారు 1900 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మూడేళ్ల క్రితం వరకూ అనావృష్టి నెలకొనడంతో నీటి కొరతతో పంటల సాగును రైతులు పూర్తిగా తగ్గించారు. ప్రస్తుతం వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం 2400 ఎకరాలని ఏఓ నవత తెలిపారు. కొందరు రైతులు చీనీ, బ్యాడిగి మిర్చి సాగు చేసినప్పటికీ ఈ ఏడాది రబీలో వేరుశనగ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపారన్నారు. పంట కూడా ఆశాజనకంగా ఉందన్నారు.